



"మే ఐకమిన్ సర్?"

"యస్-కమిన్!"

స్ప్రింగ్ డోర్స్ తెరుచుకుని లోనికి వెళ్ళాడు ప్రసాద్.

"ప్లీజ్, సిడౌన్!"

డాక్టరు చూపించిన కుర్చీలో కూర్చోబోతూన్న ప్రసాదు సందేహిస్తూ లేచి నిలబడ్డాడు.

"మీరు...మీరు....నువ్వు రాజశేఖరం కదూ?"

ఆ మాటలకు ఆశ్చర్యంగా తలెత్తి చూసిన రాజు, సంభ్రమంగా ప్రసాదునే చూస్తుండిపోయాడు.

"అరే-నువ్వా ప్రసాద్! ఎంత అదృష్టం! ఎంత కాలానికి కలుసుకున్నాం!"

స్నేహితులిద్దరూ సంభ్రమా


nani 00.

శ్చర్యాలతో ఒకరి నొకరు చూసు కుంటూ వుండిపోయారు.

ముందుగా తేరుకున్న రాజు, "ఆం-ఏమిటిరా ప్రసాద్! ఏం చేస్తున్నావ్? పెళ్ళి చేసుకున్నావా? పిల్లలా? ఈ వూళ్ళో ఏం చేస్తున్నావ్?"

"అబ్బ! ఆపరా బాబూ, నీ నీ ప్రశ్నల వర్షం. ముందు నీ సంగతి చెప్పు-స్టేట్ నుండి ఎప్పుడు తిరిగొచ్చావ్? అక్కడే మేరేజ్ చేసుకుని సెటిలయి పోయి వుంటా వనుకున్నాను. ఇక్కడి కొచ్చి ఎప్పుడు ప్రాక్టీసు పెట్టావు? బైట బోర్డు చూసి క్షణ కాలం నీవు మనసులో మెదిలినా, స్టేట్స్ నుండి వచ్చి నీవే ఇక్కడ వుంటావనుకో లేదురా!"

"అయిందా నీ వుపన్యాసం? నేనిక్కడ ప్రాక్టీసు పెట్టి రెండు సంవత్సరాలైంది. స్టేట్స్ నుండి రాగానే ఇక్కడే ప్రాక్టీసు పెట్టాను. ప్రాక్టీసు బాగానే నడుస్తుంది. ఇంక మేరేజంటావా__అక్కడ ఎవర్నీ చేసుకోలేదురా! ఇక్కడి కొచ్చాక నాకు నచ్చిన అమ్మాయి దొరికింది. త్వరలో మేరేజ్ చేసుకో బోతున్నాము. ఆ అమ్మాయిదో విచిత్రమైన కథరా! ఆవిడకు ఆరు సంవత్సరాల క్రితమే మేరేజయిందట. అనుకోని పరిస్థితుల్లో ఆవిడ్ని ఎవరో పాడు చేస్తే, ఆవిడ భర్త ఆవిడ్ని దోషిగా నిలబెట్టి మాట్లాడితే, అతన్నుండి దూరంగా వచ్చేసి, నర్సు ట్రైనింగయ్యి, నా హాస్పిటల్లో నర్సుగా చేరింది. ఈ రెండు సంవత్సరాలుగా ఆవిడ్ని గమనిం చాకనే పెళ్ళి ప్రసక్తి తెచ్చాను. ఆవిడ కథంతా చెప్పింది. ఆవిడ నిజాయితీ నా కెంతో నచ్చింది. మనిషి చాలా మంచిది. అందం, అణకువ, సహనం, ఓర్పు అన్నీ వున్నాయి ఆమెలో.

"పూర్ ఫెలో! ఆవిడ మొదటి భర్త చేతులారా ఇలాంటి భార్యను ఎలా వదులుకోగలిగాడో గాని, ఆ స్థానం నాకు దొరికేలా చేస్తున్నం దుకు రోజూ అతనికి నా థ్యాంక్స్ చెప్పు కుంటున్నానురా!" రాజు మాటలకు కొరడాతో వీపున ఛెళ్ళున చరిచినట్లైంది ప్రసాదుకు. ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి.

"అరే! అదేమిటిరా-అలా అయిపోయావు? నిన్ను బోరు కొట్టించేస్తున్నాను కదూ? వుండు-కాఫీ తాగి మాట్లాడుకుందాం. బోయ్!" పిలిచాడు.

రెండు కాఫీలు తెమ్మని పంపించి, "ఆం- ఏమిటి చెప్పరా? నీ సంగతులేం చెప్పటం లేదు.

ముందీ విషయం చెప్పు-నీ కేమిటి నీరసం, ఈ డాక్టర్ గాడ్ని వెదుక్కుంటూ వచ్చావ్? నీ జబ్బు ఏదైనా దానికి నా కృతజ్ఞతలురా! ఈ విధంగానైనా మనం కలుసుకో గలిగినందుకు నాకెంతో ఆనందంగా వుందిరా!" స్టెతస్కోపు దగ్గరకు తీసుకుంటూ డాక్టరు రాజు, ప్రసాదు దగ్గరకు జరిగాడు.

అప్పటికి కొంచెం తేరుకున్నాడు ప్రసాదు. "నీ డాక్టరు బుద్ధి పోనిచ్చుకున్నావు కాదురా! నాకే జబ్బూ లేదు గాని, మేడ మీద స్పెషల్ వార్డులో పేషెంటు మంగ తాయారు నా భార్య. నిన్న నేను వూళ్ళో లేను. పెయిన్స్ వస్తున్నాయని మా అత్తగారు, మామగారు ఆవిడ్నిక్కడ చేర్చారట. డెలివరీ టైముకు లేడీ డాక్టర్ను పిలుస్తా నన్నారట...." ప్రసాదు ఇంకా ఏదో మాట్లాడుతూనే వున్నాడు.

రాజు ఎంతగానో ఆశ్చర్య పోయాడు. "ఆవిడా నీ వైఫ్!" తన ప్రమేయం లేకుండా నే అనేశాడు.

ఏడ్పులేక నవ్వినట్లుగా నవ్వాడు ప్రసాదు. "అవునురా! చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత అని-నేను చేసిన దానికి నేనే ఈ లోకంలో అనుభవించాలి కదా! డబ్బుకి కక్కుర్తిపడి, లక్షల కట్నంతో వచ్చిన ఈ అనుమానం పిశాచిని కట్టుకున్నానురా! జీవితమంటే విరక్తి పుట్టేస్తోంది. నరకమంటే ఏమిటో ఇక్కడే అనుభవిస్తున్నాను. అయినా నాకీ శిక్ష కావలసిందేరా!"

"ఛ-ఛ! అదేమిటీగా అలా మాట్లాడుతున్నావు? నన్ను క్షమించరా! నీ మనసు నొప్పించాను. ఆఁ-ఆవిడకు ఈ రాత్రి డెలివరీ అవుతుంది. ఇందాకే లేడీ డాక్టరు వచ్చి చూసి వెళ్ళారు. నీ వైఫ్‌కేం భయం లేదు. నీవేం వర్రీ అవకు."

* * *

ఆ రోజు హాస్పిటల్ కొస్తూనే తన భార్య బెడ్ దగ్గర నిలబడి వున్న నర్స్‌ని చూసి, అదిరిపడ్డాడు ప్రసాదు. గుండెల్లో రైళ్ళు పరిగెత్త సాగాయి అతనికి. నిలబడటానికూడా ఓపిక లేక, గుమ్మం ఇవతలనే బల్ల మీద కూలబడి పోయాడు. అతని మనస్సు ఆరు సంవత్సరాల వెనక్కు పరుగెత్తు కెళ్ళింది—

సుజాత, ప్రసాదు కలిసి కాపురం చేసింది సంవత్సరమే ఐనా, నూరు జన్మల ఆనందాన్ని, అనుబంధాన్ని పంచి ఇచ్చింది సుజాత భర్తకు.

ఆ రోజు...కాలేజీకి వెళ్ళటానికి తయారవుతూన్న భర్త దగ్గరకు హడావుడిగా నేప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ వచ్చింది సుజాత.

"సాయంత్రం పెందలాడే వచ్చేయాలి మీరు. రేపు గొప్ప విశేషం వుంది. దాని గురించి మనం తప్పకుండా పట్నం వెళ్ళాలి. ఆ విశేషం ఏమిటో చెప్పుకోండి చూద్దాం?" అడిగింది.

"అబ్బ-నాకూ తెలుసులేవోయ్! ఇంకా అంత మరుపు రాలేదులే నాకు. రేపు మన మేరేజ్ డే. ఇది మన ఫస్ట్ మేరేజ్ డే గాబట్టి మా కాలేజీ స్టాఫ్ నందర్నీ పిలుస్తాను పార్టీకి. ఇంటి దగ్గర నీకు పరిచయం వున్న వాళ్ళను కూడా పిలుచుకో సుజా!" అన్నాడు ప్రసాదు.

"నాకు ఇంకా ఇక్కడ ఎవరూ అంతగా పరిచయం కాలేదుగాని, పక్కింటి బామ్మగార్ని, ఎదురింటి పిన్నిగార్ని పిలుస్తానండీ! మీరు మట్టుకు మధ్యాహ్నం శలవు పెట్టి ఇంటికి వచ్చెయ్యండి. నేను రెడీగా వుంటాను. నాకు, మీకు క్రొత్త బట్టలు కొనుక్కొని, అలాగే హోటల్లో మీల్స్ చేసేసి, పిక్చర్ చూసి వచ్చేద్దాం. ఎలా వుంది మన ప్లాను?" భర్త షర్టు గుండీలు పెడుతూ అంది సుజాత.

"ఓ. కే! రాణీగారు ప్లాను వేయటమూ, రాజావారు కాదనడమూనా? మరి, కాలేజీకి టైమవుతూంది-వెళ్ళి రానా?"

భార్య 'టా-టా' చెబుతూండగా సైకిలెక్కి వెళ్ళిపోయాడు ప్రసాదు.

ఆ సాయంత్రం ప్రసాదు, సుజాత షాపింగు పూర్తి చేసుకుని హోటల్లో భోంచేసి సినిమా కెళ్ళారు. సెంకెండ్ షో వదలగానే ఇద్దరూ రిక్షా మాట్లాడుకుని ఎక్కారు. వూరు వదలగానే రోడ్డు కిరువైపులా పొలాలు. అమావాస్య దగ్గర కావటంతో అంతా చీకటి మయంగా వుంది. చుట్టూ కీచురాళ్ళ ధ్వని. కప్పల బెకబెకలు, నక్కల అరుపులు.

"అబ్బ! ఇంత చీకటిగా వుందే మిటండీ? భయమేస్తుంది బాబూ!" భర్తకు దగ్గరగా జరిగి కూర్చుంది సుజాత.

"అంత భయమైతే ఎలా సుజా? చెట్టంత మగాడ్ని పక్కన పెట్టుకుని ఏమిటోయ్ నీ పిరికితనం? నేను నీ పక్కనుండగానే నీవు భయపడుతున్నావంటే నాకెంత ఇన్‌సల్ట్?" భార్య భుజం చుట్టూ చేతిని పోనిచ్చి దగ్గరగా లాక్కు-

న్నాడు సుజాతను.

రిక్షా సగం దూరం వచ్చేసి నట్లే! ఇంక అక్కడ్నుండి రోడ్డు కిరువేపులా అంతా మామిడితోట. పగలైతే చూడటానికి ఎంతో సర దాగా వుంటుందిగాని, రాత్రులు అందునా చీకటి రాత్రుల్లో మామిడి చెట్లు, జుత్తు విరబోసుకున్న దెయ్యాల్లా భీతి గొల్పుతూంటాయి.

ఎదురు గాలి మూలంగా రిక్షా నెమ్మదిగా పోతుంది. ఇంతలో మామిడి తోపుల్లోంచి నాలుగు ఆకా రాలు నడిచి వీళ్ళవేపుగా రావడం, ఆ మసక వెలుతుర్లో కనిపించింది. అసలే భయంతో బితుకు బితుకు మంటున్న సుజాత, ఇంకా భయం తో బిగిసిపోయింది.

దెయ్యాలంటే ప్రసాద్‌కు నమ్మ కంలేదు. 'కాని ఈ అర్ధరాత్రి సమ యంలో అంత గుబురుగా భయం కరంగావున్న మామిడి తోపుల్లోంచి వచ్చే అవసరం ఎవరికుంటుందా?' అని ప్రసాదు ఆలోచిస్తుండగానే, ఆ నాలుగు ఆకారాలు రిక్షా దగ్గర కొచ్చి ఆగాయి.

ఇద్దరు రిక్షా ఆపి రిక్షావాడ్ని క్రిందికి లాగారు. "ఏయ్! ఇద్దరూ రిక్షా దిగండి!" కరుగ్గా అన్నాడు ఒకడు.

ఆమాట్లాడేవాడి తీరుచూస్తుంటే ఒళ్ళు మండుకొచ్చింది ప్రసాదుకు.

'ఖచ్చితంగా వీళ్ళు దొంగలే! వాళ్ళు నలుగురు, తాను ఒక్కడు. అయినా ఫర్వాలేదు. కసరత్తు చేసి కండలు పెంచిన శరీరం తనది. పోట్లాటలో ఒడుపులన్నీ తెలుసు తనకు. అదీగాక రిక్షావాడు కూడా ఉన్నాడు-సాయంగా.' ఇలా సాగు తున్నాయి ప్రసాదు ఆలోచనలు.

సుజాతకు భయంతో ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. మనిషి చిన్నగా వణకసాగింది. భయం లేదన్నట్లుగా ప్రసాద్ భార్య చేతిని గట్టిగా నొక్కి పట్టు కున్నాడు. రిక్షాలోంచి వీళ్ళిద్దరూ ఎంతసేపటికీ క్రిందికి దిగకపోవ టంతో, ఇద్దరు ముందుకొచ్చి ప్రసాద్, సుజాతలను జబ్బపట్టి క్రిందికి లాగారు. సుజాత కెవ్వున అరిచింది. ఈ హఠాత్‌పరిణామానికి మితిమీరిన కోపంతో, వాళ్ళు నలు గురు తనొక్కడు అని ముందూ వెనుకా ఆలోచించకుండానే అందు లో ఒకడ్ని చాచి లెంపకాయ కొట్టాడు ప్రసాద్.

"బద్మాష్! నన్నే కొడతావు రా?" జేబునుండి కైజారు తీసి ప్రసాదుమీదికి రాబోయాడు అవ తల మనిషి. వాడి ప్రక్కనున్న వాడు వారించాడు. "మనం చేయాలను

కున్నదొకటి-నీవు మరోటి చేయబోతున్నావ్! కాస్త తమాయించుకో భాయ్! కొద్దిసేపట్లో వీడి పొగరణిగి పోతుంది గదా!"

ఆ మాటలకు సుజాతకు ఒంట్లో రక్తం గడ్డకట్టుకు పోయినట్లయింది. మస్తిష్కం మొద్దుబారి పోయింది. నాలుగడుగుల దూరంలో వున్న భర్తను ఒక్క ఉదుటున చేరి బల్లిలా కరుచుకుపోయింది. రిక్షావాడ్ని చేతులు వెనక్కి విరిచి పట్టుకుని ఒకడు ముందుకు నడిపించాడు. భయంతో రిక్షావాడు సుజాత కంటే అధ్వాన్నంగా తయారయ్యాడు.

"ఊఁ- నడవండి!" మిగిలిన ముగ్గురూ సుజాత, ప్రసాద్‌లను మామిడి తోటలవేపు నడిపించారు.

'వీళ్ళు డబ్బు, బంగారంకోరకు తమను అడ్డగించినట్లు కనిపించటం లేదు. అలాగైతే తన దగ్గరున్న వాచీ, రింగ్, పర్సులోని డబ్బులు, సుజాత దగ్గరున్న నగలు తీసుకుని తమని వదిలిపెడుదురు. మరయితే తమనేం చేద్దామని వీళ్ళ ఉద్దేశ్యం? తను ఈ వూరికి క్రొత్త వాడు....' ప్రసాద్ మనసులో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రిక్షావాడ్ని దూరంగా ఒక మామిడి చెట్టుకు కట్టారు. ఒకడు సుజాతను పట్టుకునుండగా మిగిలిన వాళ్ళలో ఒకడు కైజారును ప్రసాదు పీకకు నొక్కి పట్టుకున్నాడు. ఇద్దరు ప్రసాదు చేతుల్ని వెనక్కి విరిచి కట్టబోతున్నారు.

సుజాత ఒక్క పరుగున వచ్చి భర్తను చుట్టేసుకుంది. "ఈయన్ని ఎందుకు కట్టేస్తున్నారు? మమ్మల్నేం చేస్తారు? ఇదిగో—నా దగ్గరున్న నగలు ఇచ్చేస్తాను. దయచేసి మమ్మల్ని వదిలేయండి! నా భర్తనేం చెయ్యకండి!" ఏడుస్తూ మాట్లాడుతున్న సుజాత మాటలకు వాళ్ళు నలుగురూ పకపకా నవ్వారు. ఏ చిన్న అవకాశం దొరికినా తిరగబడటానికని వేచి చూస్తున్నాడు ప్రసాద్.

"ఊఁ- దాన్ని తీసుకెళ్ళి మీ పని కానివ్వండి. మేమిద్దరం వీడి దగ్గరుంటాం." ఇద్దరు ఇలా అనగానే మిగిలిన ఇద్దరూ, సుజాతను లాక్కుపోబోయారు.

"ఆగండి!" గొంతు చించుకుని అరిచాడు ప్రసాదు. "ఆమెను ఎక్కడకు తీసుకెళ్తారు? ఏం చేస్తారు? మీరేమైనా చేయదలచుకుంటే నన్ను చంపండి నరకండి. అంతేగాని-ఆవిడ్నేం చెయ్యకద్దు!" ప్రసాదు మాటలకు నలుగురూ వెకిలిగా నవ్వారు.

"నిన్నేం చేసుంకుటామయ్యో మేము? మాకు కావలసింది నీ పెళ్ళాం. మగాళ్ళకు ఆడదానితో పని వుంటుందిగాని, నీతో మాకేం పని చెప్పు? అర్థమైందనుకుంటా! ఎంత-ఒక్క అరగంటలో మా పని ముగించుకుని మిమ్మల్ని వది లేస్తాం. గుట్టు చప్పుడు గాకుండా పోదురుగాని. కుక్కిన పేనులా వుండు. పిచ్చి పిచ్చి వేషాలేశా వంటే మాకేం క్రొత్త గాదు. జాగ్రత్త!"

సుజాతను వాళ్ళేం చేయ బోతున్నారో అర్థం అయ్యింది ప్రసాద్‌కు.

ఒంట్లో రక్తమంతా ముఖం మీదకు చిమ్మినట్లయింది. వెన్నులో ఎవరో బలంగా బాకుతో పొడిచి నట్లు, తనను సజీవంగా దహనం చేస్తున్నట్లూ....మనిషి నిలువునా వణికిపోతున్నాడు. కోపంతో పిడి కిళ్ళు బిగించి పట్టుకుని, కట్లు విడి పించుకోటానికి బలంగా లాక్కు న్నాడు. దగ్గరలో ఉన్నవాడ్ని ఫెడీ మంటూ కాలెత్తి పొట్టలో తన్నాడు. క్రింద పడినవాడు లేచి దుమ్ము దులుపుకుంటూనే ప్రసాద్ చెంపలు రెండు చేతుల్తో వాయిం చాడు. ప్రసాదు నోటినుండి నెత్తురు కారుతూంది.

"రాస్కెల్స్! మగాళ్ళయితే నాకట్లు విప్పి నాతో తేల్చుకోండిరా! ఇలా చీకట్లో ముఖాలు తెలియ కుండా, ముండల్లా, ముసుగులో గుద్దులాట ఎందుకురా? ఒరేయ్! నా భార్యనేమన్నా చేశారా-మీ రక్తం కళ్ళ చూస్తాను. దమ్ములున్న వాళ్ళ యితే నా దగ్గరకు రండిరా స్కౌం డ్రల్స్!" కట్లు విప్పుకోటానికి గింజుకుంటూనే ప్రసాద్ వాళ్ళను నోటి కొచ్చినట్లు తిడుతున్నాడు. ఏడుస్తున్న సుజాతను బలవంతంగా లాక్కుపోయారు.

"ఒరేయ్! వీడి ప్రేలాపన మరీ ఎక్కువైంది. మాట వినకుండా పై కెళ్ళటానికి కంగారుపడుతున్నట్లు న్నాడు. త్వరగా పంపించే ఏర్పాటు చేయరా!" ఒకడిలా అనగానే ప్రక్కనున్న వాడు కైజారును ప్రసాదు గొంతు దగ్గర గుచ్చి పట్టుకున్నాడు. రక్తం బొట బొటా కారింది. బాధతో పళ్ళు బిగించి తల వెనక్కి వాల్చి కళ్ళు మూసు కున్నాడు.

సుజాత ఏడుపు అరణ్య రోదనమే అయింది. క్రమంగా ఏడుపు కూడా విన్పించటం తగ్గి పోయింది. అక్కడ జరిగే పాపా నికి సాక్ష్యాలుగా పిశాచాల్లా తలలు ఊపుతూ వికటాట్టహాసం చేస్తున్న

మామిడి చెట్లు మాత్రం నిలబడు న్నాయి. కాని డబ్బు లంచం పెట్టి నోరు నొక్కేసిన సాక్షుల్లా వున్నాయి అవి.

* * *

ఆ ఘోర సంఘటన జరిగి అప్పుడే నాల్గు రోజులు కావ స్తూంది. భార్యా భర్త లిద్దరూ ఆ నాలుగు రోజులూ, నాలుగు యుగాల్లా గడిపారు. ప్రసాదు మనసులో విషబీజాలు మొల కెత్తాయి. అవి కలుపు మొక్కల్లా పెరిగి పోతున్నాయి. వాటిని పీకి పారవేసే ప్రయత్నం చెయ్యలేదు అతను. నెల్లాళ్ళ క్రితం ప్రసాదు స్నేహితుడు గిరి చెప్పిన మాటలే అతని చెవుల్లో గింగురుమంటు న్నాయి. గిరి బాగా జులాయి మనిషి. రోజుకో కొత్త రకం వెరైటీ ఆడవాన్ని అనుభవించే వాడు.

"పెళ్ళి కాకుండానే ఇంత బరితెగించావు. నీకు పెళ్ళి కాదు రారే" అని ఎన్ని విధాలో నచ్చ చెప్పి మార్చబోయాడు ప్రసాదు.

"పులి మనిషి రక్తం రుచి చూడనంత వరకే బుద్ధిగా వుంటుంది. ఒకసారి రుచి మరి గిందా- ఇంక దాన్ని ఆపటం ఎవరి తరం? అలాగే మగాడూ! ఆడదాని పొందు మరిగాక దాన్ని ఎలా మానగలడురా?" అని చెప్పటమే గాక, ఆడవాళ్ళలో వుండే ఎన్నో కిటుకులు చెప్పాడు. ఏ మగాడైనా ఆడదాని పూర్తి సహకారం లేకుండా ఏమీ చేయలేడని చెప్పాడు. ఆ మాటలే ప్రసాదు మనసులో బాగా నాటుకుపోయాయి.

తన భార్య ఇద్దర్ని ప్రతిఘటించ లేకపోయిందంటే నమ్మలేక పోతు న్నాడు. పెద్దగా అల్లరి పెట్టకుండా వాళ్ళకు లొంగిపోయిందన్న అను మానం పెనుభూతంలా ఆవరించు కుంది. మనిషిలో అనుమానం తలెత్తకుండానే వుండాలి గాని, తలెత్తిందా—అది పెనుభూతమై మనిషిని బ్రతికున్నంత కాలం నిలు వునా దహించి వేస్తుంది. అలాంటి మనుషులు తాము సుఖంగా బ్రతక లేరు, ఎదుటి వార్ని సుఖపడ నీయరు. ప్రసాదు విషయంలో అదే జరిగింది. తన భార్యను పరాయి మగవాళ్ళు అనుభవించా రన్నదే అతని మనసును పురుగులా దొలిచేస్తుంది. భార్యను తాకా లంటేనే అసహ్యంగాను, మాట్లాడా లంటేనే విరక్తిగాను ఫీలవు తున్నాడు.

ఆ రోజు భార్య మంచం దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చు

న్నాడు ప్రసాదు. "సుజాతా!" భర్త పిలుపుతో కళ్ళు తెరిచింది సుజాత. "వాళ్ళ నలుగురిలో ఎవర్నయినా గుర్తు పట్టగలవా?" అప్పటికే ఆ ప్రశ్న ఎన్నోసార్లు అడిగాడు.

భర్త అడిగిన దానికి లేదన్నట్లుగా తల వూపింది సుజాత.

"ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకు..."

భర్త ఏమంటాడోనని ఆసక్తిగా చూసింది అతని వైపు.

"వాళ్ళు నిన్ను నా ఎదురుగా వున్న మామిడి చెట్టు అవతలకు తీసుకెళ్ళే వరకూ నీవు ప్రతిఘటిస్తూనే వున్నావు. కాని ఆ తర్వాత నీవు ఎటువంటి గొడవా లేకుండా వాళ్ళకు లొంగిపోయావు. ఆడదాని కిష్టం లేనిదే ఓ పట్టాన ఏ మగాడూ ఏం చెయ్యలే డంటారు. నీవు ఏమైనా అల్లరి పెడతావేమోనని చెవులు రిక్కించుకుని విన్నాను. కాని....కాని..."

భర్త మాటలు పూర్తి కాకుండానే గబుక్కున లేచి కూర్చుంది సుజాత. అతన్ని చూసి పక్కలో బాంబులా, తనను చుట్టుకున్న విష సర్పంలా జడుసుకుంది. మరు నిముషంలో అతన్ని అసహ్యంగా విరక్తిగా జుగుప్సాకరంగా చూసింది. ఇంక అతనితో ఒక్క మాటైనా మాట్లాడకుండా ముఖం మరో వైపుకి తిప్పుకుని పడుకుండి పోయింది.

ఒక రోజంతా బాగా ఆలోచించుకుని ఓ నిర్ణయానికొచ్చిన సుజాత, భర్తకో వుత్తరం వ్రాసిపెట్టి వెళ్ళిపోయింది. ఆ వుత్తరంలోని ప్రతి మాటా ఇప్పటికీ ప్రసాదు చెవుల్లో గింగురుమంటున్నాయి.

"ప్రసాద్‌కు—నీలో వచ్చిన మార్పు నేను బాగా గమనించాను. ఎలాంటి మగాడైనా తన భార్య తనొక్కడి స్వంతమే కావాలని, మరో మగాడి నీడ కూడా తన భార్యమీద పడకూడదనీ కోరుకుంటాడు. కాని తానెంతవరకూ పవిత్రంగా వుండగలుగుతున్నాడనేది ఆలోచించడు. శీలం అన్నది ఆడ, మగ ఇద్దరికీ వుండవలసిందే. బలవంతంగా వంచింపబడిన నన్ను నీ కళ్ళెదుట జరిగినదానికి అనుమానిస్తున్నావే! నీ సంస్కారం బయట పడిందిప్పుడు. పెళ్ళి కాక ముందు నీకు ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళతో సంబంధముండేదని చెబితే, నీ నిజాయితీకి సంతోషించాను. నీ ఇష్టపూర్వకంగా తిరిగినప్పుడు నీ పవిత్రత పోలేదు. కాని, బలవంతంగా వంచింపబడినప్పుడు నా పవిత్రత పోయిం

దంటున్నావు నీవు.

యని నేరానికి శిక్ష అనుభవించటం నావల్ల కాదు. చెట్టంత మగాడివి-అక్కడ వుండీ, నీవేం చేయగలిగావు? అక్కడంతా నా ఇష్టపూర్వకంగా జరిగినట్లు మాట్లాడావు. అక్కడ నేను అంతకంటే రెట్టింపు అల్లరి చెయ్యగలను. కాని—ఫలితం? మనను ఆదుకునే నాధుడెవరూ లేడక్కడ. అదీగాక నా గోల ఎక్కువయ్యేకొద్దీ—నీవు మరీ తెగిస్తావు. అప్పుడు నీ ప్రాణాలకక్కడ విలువేం వుంచరు వాళ్ళు. అది బాగా గమనించే, నా శీలం పోవటమేగాక—నిన్ను పోగొట్టుకుని బ్రతకలేననే.... అదంతా చచ్చినట్లు భరించాను. అక్కడ వాళ్ళు నీ ప్రాణాలు తీసినా ఎంతో సంతోషించేదాన్ని.

ఇంక నీవు దోషిలా చూసే ఆ చూపులు భరించలేను నేను. నేను చస్తానని అనుకోకు. అది పిరికివాళ్ళ లక్షణం. నా బ్రతుకు తెరువు చూపించేపాటి విద్య నాకుంది. ఆ రోజు ఆ రాక్షసులు నన్ను వంచిస్తే, నన్ను దరికి చేర్చి ఓదార్చవలసింది పోయి, ఓ మృగంలా ప్రవర్తించావు. పెనంమీదనుండి పొయ్యిలో పడి నట్టైంది నా పరిస్థితి. ఏ దేశంలోనూ, ఏ కాలంలోనూ, బాధలు పడి కృంగి కృశించి మృత్యువులో తలదాచుకునేది స్త్రీయే. నిజానికి మగవాడే స్త్రీని ముళ్ళ బాటల్లోకి తోస్తాడు. ఆమెని గోతిలోకి తోసిన పురుషుడ్ని—న్యాయం, సంఘం ఆఖరికి, ప్రకృతి కూడా దండించదు. కాని స్త్రీని, న్యాయం సంఘమేకాదు—ప్రకృతి కూడా అతి కఠినంగా శిక్షిస్తుంది. కానీ, నే నెవ్వరికీ ఏ పరిస్థితుల్లోనూ భయపడను. నా మనసు పవిత్రంగా వున్నంతవరకూ, నే నేతప్పు చెయ్యనంత వరకూ, నే నెవ్వరికీ తల వొగ్గను. కాని—నన్ను అనుమానించిన పాపానికి తగిన ఫలితం ఈ జన్మలోనే అనుభవిస్తావు. నిన్ను మన్నించడం నన్ను నేనే వంచించుకోడం అవుతుంది.

శలవ్
సుజాత."

"ఏమిటి సార్! ఇక్కడే కూర్చుండిపోయారు?" హాస్పిటల్ బోయ్ మాటలతో తేరుకుని, గతం నుండి వర్తమానంలో కొచ్చి వులిక్కిపడ్డాడు ప్రసాద్. సందేహం తీరక బోయ్‌ని అడిగాడు.

"ఆవిడ సుజాతమ్మగారండీ! మా డాక్టరుగారికి కాబోయే భార్య. చాలా మంచిదయ్యగారూ! అయ్యో

గారు ఆ యమ్మని ఈ పని మానేసి ఇంటి దగ్గర రెస్టు తీసుకోమంటే ఖాళీగా వుంటే ఏం తోచదని, రోజూ ఆస్పిటల్ కొస్తూనే వుం టుంది. ఆ యమ్మకు చాలా ఓపి కండీ అయ్యగారూ! ఎవర్నీ ఒక్క సారి కూడా విసుక్కోగా చూళ్ళే దనుకోండి...." ఇంక ప్రసాదు చెవులకేం వినిపించటం లేదు. కాని—భార్య అలివేలుమంగ తాయారు హూంకరింపుతో తిరిగి ఈ లోకంలోకొచ్చి పడ్డాడు.

"ఏం- అయ్యిందా ఆ నర్సుని శల్య పరీక్షలు చేయటం? నీ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. దాన్నెందు కలా గుడ్లప్పగించి చూస్తున్నావు? మంచం మీద పడుంది కదా- నేనేం చూడ లేదనుకుంటున్నా వేమో! అదలా తలొంచుకుని పోతుంటే, నీకేం పోయేకాలం-ఒళ్ళంతా కళ్ళు చేసుకుని తినేసేలా చూస్తున్నావు? నీకేం మాయరోగం వచ్చిం దంటా?" అంది మంగతాయారు.

ప్రసాదు సిగ్గుతో బిక్క చచ్చి పోయాడు. కాని నోరెత్తటానికి వీల్లేదు.

* * *

"నిన్న నీకు సుజాతను- అదే వుడ్ బి వైఫ్‌ను పరిచయం చెయ్యనే లేదు. నిన్న తనకు బావుండక ఇంటి దగ్గిరనే వుండి పోయిందిరా. కమాన్ సుజాతా!" పిలిచాడు రాజు.

లోని కొచ్చింది సుజాత. ప్రసాదును చూస్తూనే వులిక్కి పడింది. ప్రసాదు ముఖంలో రక్త మంతా తీసేసినట్లు తెల్లగా పాలి పోయింది. ఇద్దర్నీ పరిచయం చేశాడు రాజు. కాని సుజాత నుండి ఎటువంటి రెస్పాన్సు రాలేదు. ప్రసాదు అప్రయత్నంగానే చేతు లెత్తినమస్కరించాడు.సుజాత అలా నిలబడే చూస్తూంది.సుజాత ప్రవర్త నకు చిన్నబుచ్చుకున్నాడు రాజు.

"అదేమిటి సుజా! వాడ్ని విష్ చేయాలని కూడా మరిచి పోయి అలా నిలబడిపోయా వేమిటి? నా బెస్ట్ ఫ్రెండు...."

"ఓ- సారీ డాక్టరుగారూ! అడ్డ మైన వాళ్ళకూ నమస్కరించి నా చేతుల్ని అపవిత్రం చేసుకోలేను. నమస్కారా లందుకునే అర్హత అందరికీ వుండదండీ డాక్టర్!" కళ్ళల్లో నిప్పులు రాలుస్తూ ప్రసాదు వైపే చూస్తూ విసురుగా, వచ్చిన దారినే వెళ్ళిపోయింది సుజాత.

చెప్పు తీసుకుని చెంప మీద కొట్టినట్లయింది ప్రసాదుకు. అయో మయంగా ప్రసాదునే చూస్తూండి పోయాడు రాజు. *